# తిరిగిరాని యవ్వనం

ఐదేండ్ల ఎడబాటు తర్వాత......మొదటిసారిగా ఆ ఊళ్లో దిగాడతను. పైకి ఏ రోగం లేనట్టు కనబడుతున్నా, మందు లేని రోగం అతడిని ఆక్రమిస్తుంది. బ్రతుకు దెరువు కొరకని బజారునపడి, బ్రతకాలని తనకున్నా బ్రతికించే మందులులేక, చావుకొరకు బ్రతుకుతూ నిస్సత్తువగా మొదటి అడుగు వేసాడు.

మంచులా కరుగుతున్న జ్ఞాపకాల మధ్య మరుగునపడిన మానవత్వం అతడిని ఆపనికి పురికొల్పింది. ఏదో తెలియని కోపంతో...తనకులేని జీవితం ఆమెకు ఉండకూడదన్న కసితో వెదుకుతున్నాడు.

పల్లవీ...పల్లవీ...పల్లవిలేనిపాటలా.....పల్లవించని గొంతులా....నీ బతుకు ఆగిపోవాలి. ఐదేండ్ల ఎడబాటు తర్వాత నిన్ను నిన్నులా కాకుండా ఒకరి ఇల్లాలుగానో ప్రియురాలుగానో చూస్తాను. నేను చచ్చాననుకొని నా జ్ఞాపకాల్ని తుడిచేసి కొత్త జీవితంలో కొత్త జ్ఞాపకాలని పోగు చేసుకున్న నీకు...నీకళ్ళముందే తిరుగుతూ గతాన్ని అనుక్షణం కెలుకుతూ...మనశ్శాంతిని దూరం చేస్తాను. అవమానంతో జ్వలిస్తుంటే.....అప్పుడు.....అప్పుడు సంతోషిస్తాను. పల్లవీ...ఎక్కడా..ఎక్కడ నువ్వు! ఇంకా కనబడవేం! అతడు వీధులు తిరుగుతున్నాడు.

* * *

పల్లవిగారూ! మనరేండేళ్ళ పరిచయంలో నేనేమిటో పూర్తిగా అర్థం చేసుకున్నారనుకుంటాను. నాకూతురుకు తల్లిలేని లోటును తీర్చేది మీరే అనిపించింది. చెప్పాల్సిందంతా చెప్పాను. ఇప్పుడు చెప్పాల్సింది మీ నిర్ణయమే! ఆమె చనిపోయాక ఆలోటు ఎవరూ పూడ్చలేరనిపించింది. మిమ్మల్ని చూసాక ఆ నిర్ణయం మారింది. నాలో ఆశ చిగురించింది.

జీవితాన్ని కోల్పోయామని బాధపడేకంటే మళ్ళీ జీవితం మొదలుపెట్టడం మంచిదనిపించింది. అందుకే ఉత్తరం వ్రాస్తున్నాను. మీమీద జాలితో కాదు - అభిమానంతో, ఆరాధనతో, అంతకు మించిన అనురాగంతో నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను.

ఈ పరిసరాలకు దూరంగా వెళ్ళిపోవాలనుకుంటున్నాను. మీరు ఒప్పుకుంటే సాయంత్రం ఐదు గంటలలోపు ఫోన్ చేయండి. ఎందుకంటే ఆరింటికి 'హోరా' ఎక్స్‌ప్రెస్ ఉంటుంది. మీరు ఒప్పుకుంటే దానితో పని ఉండదనుకోండి...మీ ఫోన్ కొరకు ఎదరుచూస్తూ....

మీ

మురళి

ఉత్తరం చదవడం ఐదవసారి. ఆమెలో అంతర్మథనం మొదలయింది. కళ్ళముందు మురళి రూపం కదలాడింది. చూడగానే విచ్చుకునే పెదాలు. సంస్కారం ఉట్టిపడే మాట తీరు. చురుగ్గా కదిలే కళ్ళు. ప్రశాంత గంభీరంగా ఉండేవదనం......అతడితో పరిచయమయ్యాక మొదటిసారిగా మగాళ్ళపై తన అభిప్రాయాన్ని మార్చుకుంది పల్లవి.

గోడ గడియారం పన్నెండు కొట్టింది. ఉల్కిపడి చూసింది పల్లవి. కేవలం ఐదుగంటలే! ఈలోపు ఏదో ఒకటి నిర్ణయించుకోవాలి. కాదనడానికి కారణమేదీ లేకపోయినా జీవితం మీద ఏదో నిరాసక్తత. అందుకే అతడు మొదటిసారి తన అభిప్రాయాన్ని చెప్పినప్పుడు నిరాసక్తిగా చూస్తుండి పోయింది. రెండవసారి మీ నిర్ణయం చెప్పండి అని అడిగినప్పుడు ఆలోచించి చెబుతానంది. ఇప్పుడు ఈ ఉత్తరం.

ఇప్పుడిప్పుడే స్తబ్దత పొరలు తొలగిపోతున్నాయి. ఒంటరితనం, ఎదుటివారి చూపులు, మాటలు జీవితంపై ఆశను పెంచకపోయినా, దిగులును భయాన్ని పుట్టిస్తున్నాయి. ఆ దిగులు లోంచే కొత్త జీవితంపై ఆరాటం పుట్టుకొచ్చింది. అతడి తోడు కావాలని పిస్తుంది. ఈ ఆలోచన వచ్చిందే తడవుగా ఆరాటం అనుక్షణం పెరిగిపోతుంది.

మురళిని సర్ప్రైజ్ చెయ్యాలి. ఫోన్ చేయడం కాదు. అతడి ముందుకు వెళ్ళి నిలబడాలి. ముందుగా అతడు నమ్మడు. నా నిర్ణయం విన్నాక పొంగిపోతాడు. నేను ఈ నిర్ణయం తీసుకుంటానని ఊహించి ఉండడు. సమాధానం ఆశించిన ప్రతీసారి నా నిర్లిప్తతతో అతడి ఊహల్ని తారుమారు చేసాను. అందుకే కాబోలు ఇక్కడి నుండి దూరంగా వెళ్ళిపోవాలని నిర్ణయించుకుని ఉంటాడు. చివరిసారిగా ఈ ఉత్తరం వ్రాసి ఉంటాడు.

'అమ్మా' అన్న పిలుపుతో ఆలోచనలకు అడ్డుకట్టపడింది. తేరుకుని పక్కకు చూసింది పల్లవి. మట్టికొట్టుకుపోయిన బట్టలతో ఎదురుగా ఐదేండ్ల కొడుకు. అతడి ఆకారాన్ని చూడగానే ప్రేమా, కోపం రెండూ పొంగుకువచ్చాయి.

'వెధవా...జ్వరం వచ్చిందని స్కూలు మానేసి రోడ్లు తిరుగుతున్నావా...? ఇంతసేపు ఎక్కడి కెళ్ళావురా.....బట్టలనిండా ఆ మట్టేమిటి....? ఉండు నీ పని చెబుతాను. అంటూ రెక్కపట్టి బాత్రూం లోకి ఈడ్చుకెళ్ళింది. కునిరాగం మొదలెట్టాడు బాబు. స్నానం చేయించి బట్టలు మార్చింది పల్లవి.

"అమ్మా! రేపు నిన్ను నాన్నను తీసుకురమ్మని మా టీచర్ చెప్పింది. మా క్లాసులో పిల్లలందరూ తీసుకొస్తామని చెప్పారు." రాగం ఆపి కళ్ళుతుడుచుకుంటూ చెప్పాడు బాబు. స్కూలు గుర్తొచ్చినప్పుడల్లా అదే విషయం చెబుతూనే ఉన్నాడు బాబు.

"అలాగే లేరా! రేపు మేమిద్దరం స్కూలుకు వస్తాం. సరేనా!" కొడుకు తలనిమురుతూ అన్నది.

తల్లివేపు ఆశ్చర్యంగా చూసాడతడు. ఇంతకుముందు విన్న సమాధానం వేరు. ఇప్పుడు వింటున్న సమాధానం వేరు. వాడి కళ్ళలోని సంశయాన్ని పసిగట్టి చెప్పేలోపే అడిగాడు బాబు.

"అదేంటమ్మా! నాన్న దేవుడి వద్దకు వెళ్ళిపోయాడన్నావుకదా! ఎప్పుడొచ్చాడు...?"

కొద్దిసేపు తడబడినా స్పష్టంగా చెప్పింది పల్లవి.

"దేవుడు నాన్నను పంపించాడు. నీతో ఆడుకోవడానికి చిట్టి చెల్లెల్ని కూడా పంపించాడు. ఈరోజే మనం నాన్న దగ్గరికెళ్ళిపోదాం." గొంతుకేదో అడ్డువచ్చినట్లయింది. సూటిగా చూస్తున్న బాబు వైపు చూడలేక మొహం తిప్పుకుంది పల్లవి.

విసురుగా వెళ్ళి స్కూల్ బ్యాగ్ తెరిచాడు బాబు. పుస్తకాల మధ్యనుండి ఒకఫోటో తెచ్చి తల్లికి చూపిస్తూ 'ఇతడేకదమ్మా నాన్న' అన్నాడు. పల్లవి నిర్ఘాంతపోయి నిలబడిపోయింది. ఆ ఫోటో వాడి బ్యాగ్‌లోకి ఎలా వెళ్ళిందో అర్థం కాలేదు.

"అనిల్ గాడికి నిన్న గట్టిగా బుద్ధిచెప్పాను. నాకు నాన్నేలేడన్నాడు వాడు. ఫోటో చూపించాక కానీ నమ్మలేదు. అమ్మా.....నాన్న దగ్గరికి ఇప్పుడే వెళ్దామమ్మా!" తొందర పెడుతున్నట్టుగా అన్నాడు బాబు. ఎంత వద్దనుకున్నా గతం మరోసారి కళ్ళముందు కదిలింది.

ఒక్కసారి చూస్తే చాలు. తిరిగి చూడాలనిపించే రూపం పల్లవిది. అందంగా ఉన్నానని అందమైన కలలు కనలేదు కానీ అందమైన మనసున్నవాడు భర్తగా రావాలని కోరుకుంది. ఆమెకు తెలుసు. కలలన్నీ ఆర్థిక పరిస్థితితో ముడిపడి ఉన్నాయని. తనకు కలలు కనడం నిషిద్ధమని.

అందమే ఆమెకు శాపమైంది. పెళ్ళయిన రెండేళ్ళకే భర్తతో ఎడబాటు! అది అతడి మరణం వల్ల జరిగితే కొద్దిగా నైనా ఊరట చెందేది కానీ అలా జరగలేదు.

ఉన్న కొద్దిపాటి ఆస్తిని అమ్మేసి అప్పులు చేసి గల్ఫ్ వెళ్తానంటూ బొంబాయి చుట్టూ తిరగడం మొదలెట్టాడు. ఇంట్లో ఉన్న నాలుగు రోజులు మాట్లాడిన ప్రతీ మగాడితో సంబంధం అంటగట్టేవాడు. తను ఊళ్ళో లేనప్పుడు ఎవరెవరితో కులికావని సూటిపోటి మాటల్తో వేధించేవాడు. అందానికి ఏమాత్రం మెరుగులు దిద్దుకున్నా అనుమానంగా చూస్తూ శారీరకంగా హింసించేవాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ అప్పుల బాధ అధికమైంది. డబ్బు తీసుకున్న ఏజెంట్ మాయ మయ్యాడు. బొంబాయి వెళ్తున్నానని చెప్పి వెళ్ళిన భర్త మళ్ళీ తిరిగిరాలేదు. కొడుకు మీది బెంగతో పెద్దదిక్కుగాఉన్న పల్లవి అత్త కన్ను మూసింది. అమావాస్య చీకట్లో ఒంటరి నక్షత్రంలా మిగిలి పోయింది పల్లవి.

బతుకు ఎడారిలా మారిపోతె గుండెను రాయిచేసుకుంది పల్లవి. పుట్టింటికి వెళ్ళాలంటే పెళ్ళీడు చెల్లెళ్లు గుర్తుకొచ్చారు. తన పెళ్ళికి చేసిన అప్పులు గుర్తొచ్చాయి. భర్తతో పంచుకున్న క్షణిక సుఖాల ఫలితాన్ని నవమాసాలు మోసి తల్లిగా మారి అతడు తిరిగివస్తాడన్న ఆశతో అక్కడే ఉండిపోయింది.

దారిద్ర్యరేఖకు సమాంతరంగా అదృష్టాన్ని పరీక్షించుకుంటూ నడుస్తున్న పల్లవికి అతడి నుండి ఉత్తరం వచ్చింది. బొంబాయిలో ఏజంట్ ద్వారా మస్కట్ వెళ్తున్నానని వ్రాసాడు. ఐదేండ్ల వరకూ రానని చెడ్డ తిరుగుల్లు తిరగవద్దని హెచ్చరించాడు.

తనపై అతడి అభిప్రాయం మారకపోయినా పలకరింపుగా ఒక ఉత్తరం వ్రాసినందుకు పులకరించిపోయింది పల్లవి. అతడు క్షేమంగా తిరిగి రావాలని వేయి దేవుళ్ళకు మొక్కుకుంది. అప్పుడు కూడా ఆమె కోరిక నెరవేరలేదు. ఆరు నెలల వరకూ మళ్ళీ ఉత్తరం రాలేదు. అతడి క్షేమ సమాచారాలకొరకు ఎదురు చూస్తున్న తరుణంలో టెలిగ్రాం వచ్చింది. అతడు ఆక్సిడెంట్‌లో చనిపోయాడని దాని సారాంశం.

నిలువెల్లా వణికిపోయింది పల్లవి. ఆషాక్ నుండి తేరుకోవడానికి ఏడాది పట్టింది. తనని తాను మరోసారి తిట్టుకుని బ్రతుకుదెరువు కొరకు బయటపడింది.

అర్ధాంతరంగా ఆగిపోయిన చదువు అలవోకగా నేర్చుకున్న టైపు చిన్న ఉద్యోగం వచ్చేలా చేసాయి. చాలీ చాలని జీతంతో బతుకు ఈడ్చుకొస్తున్నా, రోజు రోజుకూ పెరిగే నిరాసక్తత బతుకు మీద వెగటును పుట్టిస్తుంది. తన దారిన తాను కాలం గడుపుదామంటే అందం మరోసారి శత్రువయింది. చూపులతో మాటలతో హింసించి, చిరునవ్వుకోసం, కొనకంటి చూపుకోసం, ఒకసైగ కోసం, కాపుకాసి వేధించే మగాళ్ళ మధ్య కొత్త బాధల్ని చవి చూసింది. అప్పుడే మురళితో పరిచయమయ్యింది పల్లవికి.

పరుల స్తన్యాన్ని చూసి మరులుగొనే లోకంలో మురళి ఒకవింత వ్యక్తిలా కనిపించా డామెకు. నలుగురిలో చెల్లీ అని ఏకాంతంలో 'చెలి'గా పిలిచే కుసంస్కారాన్ని నాగరికత ముసుగులో అందంగా అలంకరించుకుని ఊరేగుతున్న సమాజంలో అప్పుడప్పుడే జీవించడానికి అలవాటు పడుతున్న పల్లవికి మురళి పరిచయం ఒక కొత్త ప్రపంచాన్ని చూపింది.

'నా భార్య నన్ను ఓంటరిని చేసి వెళ్ళి పోయింది. తీపి గుర్తుగా మిగిలిన పాప అమ్మ కావాలని ఏడుస్తుంది. ఆ దేవత స్థానాన్ని మరొకరికివ్వలేను. పాప ఏడుపును చూడలేను.' మొదటి సారిగా తన గురించి మురళి చెబుతున్నప్పుడు ఇంత మంచి భర్తలు కూడా ఉంటారా అనిపించింది. నిజంగా ఆమె ఎవరో కాని అదృష్టవంతురాలు. రోజూ చస్తూ బ్రతికున్న తనకంటే ఎంతో అదృష్ట వంతురాలు అనుకుంది పల్లవి.

'అమ్మా!' ఎన్నో సందేహాల్ని నింపుకున్న పిలుపు. మరోసారి ఆలోచనలకు అడ్డుకట్ట పడింది.

"ఏమిటికన్నా" ప్రేమగా తలనిమురుతూ అన్నది.

'చెల్లాయి ఇన్నిరోజులు ఎక్కడుందమ్మా! దేవుడి దగ్గరేనా'

'అవును కన్నా. నీతో ఆడుకోవడానికి దేవుడు పంపించాడు! అంటూ పొడిపొడిగా సమాధానం చెప్పి అతడినికూర్చోబెట్టింది.

పెట్టె అడుగునుండి తనకిష్టమైన చీరను తీసింది. అమ్మా నాన్న గుర్తొచ్చారు. అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పెళ్ళినాటి తంతు, కన్యాదానం చేసిన తండ్రి గుర్తొచ్చాడు.

తనేం సుఖపడిందని...? భర్తతో ఉన్న రెండేళ్ళు నరకాన్ని అనుభవించింది. ఆ తర్వాత మనశ్శాంతి కరువైంది. ఎందరెన్నిచెప్పినా అదృష్టాన్ని పరీక్షించుకుంటూ చీకట్లోనే ఉండిపోయింది. కాలం ఇప్పటికైనా కరుణించింది. ఇన్ని రోజుల సంఘర్షణ తర్వాతనైనా నన్ను నన్నుగా గౌరవించే వ్యక్తితో పరిచయమయింది.

అద్దంలో తననితాను చూసుకుంది పల్లవి. చాలా రోజుల తర్వాత పెదాలపై కదిలిన చిరునవ్వు, మొహంలో వెలుగు, కళ్ళలో కాంతి, రేపటి జీవితాన్ని ఆలోచిస్తుంటే ఏదో తెలియని ఉత్సాహం. పెళ్ళి విషయం గురించి ఆలోచించినంతవరకూ ఎలాంటి స్పందనలేదు. ఈ నిర్ణయం తీసుకున్నాకే...కొత్త జీవితం మొదలెట్టాలనుకున్న తర్వాతే ఈ ఆరాటం! అది ఇది అని చెప్పలేదు కానీ ఎప్పుడు వెళ్ళి అతడి ముందు నిలబడదామా అన్న ఆతృత. మొదటిసారిగా అప్పుడే అనిపించింది పల్లవికి. ఇన్ని రోజులు ఎందుకు ఆలస్యంచేసానా అని!

సబ్బుతో మొహం కడుక్కుంది. కురులను దువ్వి చాలా రోజుల తర్వాత తనకిష్టమైన రీతిలో కొప్పుముడుచుకుంది. చీరమడతలు విప్పుతుండగా తలుపు చప్పుడయింది. ఏకాంతానికి భంగం కలిగిన మౌనిలా విసుక్కుంటూ తలుపు తెరిచింది పల్లవి.

ఎదురుగా ఉన్న వ్యక్తిని చూడగానే వెయ్యి కిలోవాట్ల విద్యుత్‌ను తాకినట్టుగా షాక్‌కు గురైపోయింది. వెనక్కి విరుచుకు పడబోయి నిలదొక్కుకుంది. నోటమాట పెకల్లేదు. అతడే ఆమెను దాటిలోపలికి వచ్చి కూర్చున్నాడు.

"బావున్నావా పల్లవీ! నేను వస్తానని ఊహించి ఉండవుకదూ! అసలు నేనుబ్రతికున్నానని కూడా ఊహించి ఉండవు. ప్రపంచంలో ఏ భర్తకీ రాని స్థితినాది. ఏ భార్యకూ ఎదురుకాని పరిస్థితి నీది. పాపం....నువ్వు మాత్రం ఏం చేయగలవు. టెలిగ్రాం వస్తే నమ్మేసావు. నువ్వయినా పెళ్ళిచేసుకుని హాయిగా కాపురం చేసుకుంటున్నావనుకున్నాను. ఒంటరిగా ఉంటున్నావేంటీ...?

నమ్మలేనట్టుగా మరోసారి రాఘవ వైపు చూసింది పల్లవి. అతడు అతడే! ఐదేండ్ల క్రితం మాయమైన తన భర్త! అధికమైన అప్పుల బాధకో..అప్పుపుట్టకనో, తల్లి మరణించినా తిరిగిరాని కొడుకు! అడ్డమైన వారితో అక్రమ సంబంధం అంటిగట్టి వేధించిన మగాడు!

అతడి వైపు అసహ్యంగా చూసింది పల్లవి. వెనక్కి తిరిగి వెళ్ళి మంచంలో కూలబడిపోయింది. ఆమె గుండెలో గునపాల్ని దించుతూ గడియారం మూడు కొట్టింది. వెక్కి వెక్కి ఏడ్వడం మొదలెట్టింది పల్లవి. అదంతా పీడకలలా ఉంది.

రాఘవ లేచి పల్లవి దగ్గరికి నడిచాడు. ఆమె నుదుటిపై చేయివేసి ఆప్యాయంగా తడిమాడు

'నన్ను క్షమించు పల్లవీ! ఇలా అడిగే అర్హత కూడా నాకులేదు. నీకు అన్యాయం చేసాను. చిత్రహింసలు పెట్టాను. చేసిన తప్పు తెలుసుకునేసరికి ఆలస్యమైంది. తేలిగ్గా డబ్బు సంపాదించ వచ్చనే ఉద్దేశంతో గల్ఫ్ వెళ్ళాలనుకున్నాను. ఏజంట్‌కి డబ్బులు కట్టి మోసపోయాను. ఆ కోపం నీమీద చూపించాను."

"పారేసుకున్న చోటనే వెదకాలనే పద్ధతి నాది. అందుకే ఎవరికీ చెప్పకుండా బొంబాయి వెళ్ళాను. ఏజంట్‌ను వెదికి పట్టుకున్నాను. అతడు నన్ను మస్కట్ పంపించాడు. డబ్బు సంపాదించుకుని నీ వద్దకు రావాలనుకున్నాను. ఏజంట్ నన్ను మరోసారి మోసం చేసాడు. కంపెనీ విసా అంటూ విజిటింగ్ విసా మీద పంపాడు. పైగా అక్కడి చట్టాలకు నా అలవాట్లకూ పొందన కుదర్లేదు. నన్ను జైల్లో వేసారు."

"మళ్ళీ పెళ్ళి చేసుకుని నువ్వయినా సుఖంగా ఉండాలని చనిపోయినట్టు టెలిగ్రాం ఇచ్చాను. రెండు సంవత్సరాలకు నన్ను విడుదల చేసి ఇండియా పంపించారు. ఆత్మహత్య చేసుకోవాలనుకుని ఆగిపోయాను. నువ్వు గుర్తొచ్చావు. బాబు పుట్టాడని నువ్వు వ్రాసిన ఉత్తరం గుర్తొచ్చింది. ఒకమంచి మనిషిగా మారి నిన్ను కలుసుకోవాలనుకున్నాను. కష్టపడి పనిచేసాను. ఉద్యోగం సంపాదించాను. ఇల్లు కొన్నాను. బ్యాంకులో డబ్బు వేసాను. బాబును చూడాలనిపించి వచ్చాను."

ఒంటిమీద తేళ్లు జెర్రులు పాకుతున్నట్టుగా అనిపించింది పల్లవికి. అతడి చేతిని దూరంగా విసిరికొట్టింది. హృదయానికి గండిపడింది. కళ్ళు కన్నీటి కాలువలవుతున్నాయి. శోకదేవత అయింది పల్లవి.

"ఇంకేం మిగిలిందని వచ్చావు. ఇల్లు ఒళ్లు గుల్ల చేసావు. బ్రతికుండగానే నరకాన్ని చూపించావు. నువ్వు మనిషివని, నాకు మనసుంటుందని మరిచి ప్రవర్తించావు. తాళి కట్టిన పాపానికి ఉరితాడులా అల్లుకున్నావు" గొంతు కూరుకుపోతుంటే కీచుగా అరిచింది పల్లవి.

ఆమె ఏడుస్తుంది. ఆమెతో పాటు అతడు ఏడుస్తున్నాడు. ఇద్దరినీ చూసి బాబు ఏడుస్తున్నాడు.

"నేను ఆరాటం చంపుకోలేక బాబును చూసిపోదామని వచ్చాను. ఇక్కడికి వచ్చాక తెలిసింది. నువ్వు ఒంటరిగా మిగిలిఉన్నావని. నా అంచనాలకు నేనే సిగ్గుపడ్డాను. నీకు కొత్త జీవితాన్నివ్వాలను కున్నాను. నువ్వు చూసిన రాఘవ ఎప్పుడో చనిపోయాడు పల్లవీ! నిన్ను....నీ సుఖాన్ని కోరుకుంటున్న రాఘవే నీముందున్నాడు. నువ్వు కరుణించి వరమిస్తే తరిద్దామని వచ్చాడు" ఆర్తిగా అన్నాడు రాఘవ. ఏడ్పును ఆపుకుంటూ.

అతడి మాటలు ఆమెను మరింతగా బాధిస్తున్నాయి. అసహనంగా చూసింది అతడి వైపు. ఆవేశంగా అరవాలనిఉంది. రోజుకొకరితో సంబంధం అంటగట్టావే! అదే నిజమైతే ఇన్నేళ్ళు ఏమగాడితోనో వెళ్ళి పోకుండా ఇక్కడే ఎందుకున్నాను? అని నిలదీసి అడగాలనిఉంది. ఆవేశం కట్టలు తెంచుకుంది పల్లవికి.

"నా కంటికి కనిపించకుండా వెళ్ళిపో..."మంచంకోడుకు తలను బాదుకుంటూ ఏడ్వడం మొదలెట్టింది. నుదురు చిట్లి రక్తం కారుతుంది.

రాఘవ సముదాయించాలని చూసాడు. ఆమెవినలేదు. సర్దిచెప్పజూసాడు. పట్టించుకోలేదు. బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు.

"నన్ను నమ్ము పల్లవీ! నేను మారిపోయాను. లక్షలు సంపాదించాను కానీ తృప్తిలేదు. నిన్ను బాధపెట్టాననే బాధే నన్ను వేధిస్తుంది. చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా జీవితాంతం నీకు కష్టమన్నది తెలియకుండా చూసుకోవాలని నిర్ణయించుకొన్నాను." అతడి గొంతులో ఆర్తి, మాటల్లో పశ్చాత్తాపం, చూపుల్లో ప్రాధేయత.

ఏడుస్తూనే మొహం తిప్పుకుంది పల్లవి. ఆమెలోని అయిష్టతను గుర్తించాడతడు ఏమను కున్నాడో కానీ లేచి నిలబడ్డాడు. భార్యగా ఆమె తనను సూటిగా కాకపోయినా సూచన ప్రాయంగానైనా అసహ్యించుకోవడం భరించలేనట్టుగా అన్నాడు.

"పల్లవీ! నేను నీ భర్తగా రాలేదు. బాబును చూసిపోదామని వచ్చాను. ఇక్కడికి వచ్చాక ఈ నిర్ణయం తీసుకున్నాను. నేను చేసింది తప్పు అని తెలుసుకునే నాటికి దిద్దుకోలేనంత దూరంగా వెళ్ళిపోయాను. ఆ అవకాశం ఇప్పుడు కలిగిందని మురిసిపోయాను. కానీ నాది అత్యాశేనని...ఆ అర్హతను కోల్పోయానని ఇప్పుడే తెలుసుకున్నాను. ఈ చేదు నిజాన్ని నేను భరించలేను. నీవులేని రేపును నేను చూడలేను. అడి తప్పిన ప్రమాణాలతో ముడివేసిన అనుబంధాన్ని శాసించే హక్కు నాకు లేకపోయినా దిక్కరించే అధికారం నీకుంది.

"మళ్ళీ జన్మంటూ ఉంటే నువ్వే భార్యవు కావాలని కోరుకుంటున్నాను. ఇప్పుడు చేసిన తప్పుకు మూల్యం అప్పుడు చెల్లించుకుంటాను. నా ఆస్తిని బాబు పేరున రాస్తాను. నేను ఆత్మహత్య చేసుకుంటాను. నేను బ్రతక్కూడదు. నాకీశాస్తి జరగాల్సిందే......" అతడు లేచి ఉన్మాదిలా బయటకు నడిచాడు.

కాలం మరోసారి ఆమెతో ఆడుకుంటుంది. మళ్ళీ అంతర్మధనం మొదలయింది. కోరివచ్చిన భర్తను కాదనడమా! కోరుకున్న వ్యక్తితో వెళ్ళిపోవడమా! మనసు ఊగిసలాడింది. అదీ క్షణికమే. జీర్ణించుకుపోయిన సాంప్రదాయపు పొరల బ్లాస్టింగ్! అనాదిగా ఆడదానిలో గూడుకట్టుకున్న అబలత్వానికి బలమైన పరీక్ష. తుఫానులో చిగురుటాకులా వణికిపోయింది పల్లవి.

ఒంటరి తనం గుర్తొచ్చింది. బంధువులు గుర్తొచ్చారు. అతడితో అనుబంధం గుర్తొచ్చింది. అతడు గుర్తుచేసి గుండె తట్టిన గతం గుర్తొచ్చింది. బాబు గుర్తొచ్చాడు. వాడి భవిష్యత్ గుర్తొచ్చింది. ఆడదై అల్లుకున్న అనుబంధానికి సాక్షిగా అతడు కట్టిన తాళి గుర్తొచ్చింది. ఆ జ్ఞాపకాల హోరులో మురళి ఉత్తరం మరుగున పడిపోయింది. రేపటి బాబు జీవితమే ఆమెను పట్టి కుదిపేస్తుంది.

అతడు వెళ్ళిపోతున్నాడు. ఆపాలా, వద్దా...?చచ్చాడనుకున్న వ్యక్తి బ్రతికివస్తే సంతోషించ కుండా ఈ తిరస్కారమేమిటి...? ఎంతకాదన్నా అతను తన భర్త. అతడితో అనుబంధాన్ని పెనవేసుకుని తల్లి అయింది. ఇప్పుడీ ఆలోచనేంటీ...?తనని తానే ప్రశ్నించుకున్నది పల్లవి.

క్షణాల్లో....కట్టుకున్న కలలమేడలు కుప్పకూలిపోయాయి. ఒంటరిజీవితంలో అలుముకున్న వైరాగ్యం, కన్యాదానం, హోమం, ఏడడుగుల నడక, అన్నీ గుర్తొచ్చాయి.

"ఏమండీ......!" కీచుగా అరిచింది.

పిలిచింది తననేనా అని వెనక్కి తిరిగి చూసాడు రాఘవ. నిజం తెలిసాక వెనుదిరిగాడు. అతడు తనని చేరేక్షణాల్ని సైతం తట్టుకోలేనట్టు పరుగెత్తుకెళ్ళి అతడి ఎదపై వాలిపోయింది. ఎడబాసి గడిపిన జీవితంలో ఎన్ని కష్టాలు గుర్తొచ్చాయో మరోసారి బావురుమంది పల్లవి.

జీర్ణించుకోలేని నిజంలా అతడు మారినందుకో లేక లిప్తవ్యవధిలో ఊపిరి పోసుకున్న ప్రేమ వెల్లువై పొంగినందుకో కాని ఆమెలో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. అంతలోకే ఏదో గుబులు అతడినుండి దూరంగా జరిగి మొహంలోకి భయం భయంగా చూస్తూ 'మళ్ళీ మోసం చేయరుగా' అన్నది.

'అలా ఎన్నటికీ జరగదు. నా పాపాన్ని కడుక్కోవడానికే దేవుడు ఈ అవకాశమిచ్చాడని భావిస్తున్నాను.' ఆమె కళ్ళలోకి ప్రేమగా చూస్తూ అన్నాడు రాఘవ.

గడియారం ఐదు కొట్టింది. పల్లవి హృదయం పిండేసినట్టయింది. మురళికి దూరమయ్యా నని కాదు - అతడితో వెళ్ళి పోవాలన్న ఆలోచన తనకు ఎందుకు వచ్చింది అని! రాఘవ రావడం కొన్ని గంటలు ఆలస్యమైతే ఎంత ఘోరం జరిగిఉండేది. ఊహించుకుంటేనే జుగుప్సగా ఉంది పల్లవికి.

కొడుకును ఎత్తుకుని ముద్దాడుతూ భర్తకు అందించింది పల్లవి. ఎడబాటు జీవితంలో పడిన కష్టాలే కబుర్లయ్యాయి వారికి. కాలం నెమ్మదిగా కరిగిపోయింది. వేకువ జారిపోయింది. కోడి గొంతుతో తూరుపు దిశ నిద్రలేచింది. మెలకువ వచ్చి పక్కకి తిరిగి చూసింది పల్లవి. అతడు కనిపించలేదు. మనసు ఏదో కీడును శంకించింది. పక్కనే కాగితం రెపరెపలాడితే అందుకుంది.

'పల్లవీ! ఏం రాయాలో ఎలా రాయాలో తెలియడంలేదు. నీవు సుఖంగా ఉంటే చూడలేక అనుక్షణం బాధపెట్టాలని వచ్చాను. నేను గల్ఫ్ వెళ్ళింది నిజం. జైల్లో మగ్గింది నిజం. బొంబాయికి

వచ్చి విచ్చలవిడిగా తిరిగి పాణం మీదికి తెచ్చుకున్నది నీకు చెప్పని నిజం. నా ఊహల్ని తారుమారు చేస్తూ - నా కొరకు ఎదురుచూసి విరక్తి చెంది నీ జీవితాన్ని బలిచేసుకున్నావని ఇక్కడికి వచ్చాక తెలుసుకున్నాను. నీక్షమాగుణం నా గుండెల్ని మెలితిప్పింది. మళ్ళీ నీ జీవితంలోకి నన్ను ఆహ్వానించక పోయినా నేనింతగా బాధ పడేవాన్ని కాదేమో!

నీ మంచితనం తెలుసుకునే నాటికి కాలం మించిపోయింది. బ్రతకాలన్న ఆశ ఇప్పుడు చిగురించినా బ్రతికించేమందు లేదు. నిన్ను బాధించాలని వచ్చి ఓడిపోయి, నీ సుఖాన్ని కోరి దూరంగా వెళ్ళిపోతున్నాను. అప్పుడు కాదు పల్లవీ....ఇప్పుడు...నిజంగా ఇప్పుడు మారిపోయాను. అందుకే నా వ్యాధి నీకు అంటుకోకముందే దూరంగా....మళ్ళీ ఈ జన్మలో కలుసుకోలేనంత దూరంగా వెళ్ళిపోతున్నాను. జీవితం మీద అవగాహనలేక తిరిగిన తిరుగుళ్ళకు ఫలితంగా.....నాకు నేను బలిపశువునై నీకు దూరంగా వెళ్తున్నాను. గుడ్‌బై.

వణుకుతున్న చేతులమధ్య కాగితం నిలబడలేక ఫ్యాన్ గాలికి దూరంగా ఎగిరి పోయింది. పల్లవి కళ్ళకు చీకట్లుకమ్మాయి.

*('అనుకోని అతిథి' పేరుతో ఆంధ్రభూమి దినపత్రిక - 5-8-2000 - మహిళా పేజీ )*